క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ అభయ ఆంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాములు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ నిర్వాహకులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ కృష్ణాజోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, స్థానిక సర్పంచ్ కూనసాని సునీత పాల్గొన్నారు.

9న ఉగాది పురస్కారాలు

నాగాయలంక: స్థానిక సాహిత్య, సాంస్కృతిక, కళా, సేవా సంస్థ అభ్యుదయ వేదిక 27వ వార్షిక ఉగాది పురస్కారాల కార్యక్రమం ఏప్రిల్ 9న నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ఏడాది ఉగాది పురస్కారాలు, సన్మానం అందుకునే వారిలో జర్నలిస్ట్స్ సంఘాల నేత వీర్ల శ్రీరామ్ యాదవ్, సాహితీవేత్త యతమర్తి అనురాధ, రంగస్థల నటుడు బోలెం రామారావు, ఆధ్యాత్మికవేత్త ఆలూరి శ్రీనివాసరావు ఉన్నారని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే వేడుకలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, విశ్రాంత ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ తమిరిశ అనంతాచార్యులు తదితర ప్రముఖులు హాజరవుతారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు వీల్‌చైర్లు అందజేత

చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో లెప్రా సొసైటీ ద్వారా ఒరాకిల్ సంస్థ సహకారంతో ఇరువురు కుష్ఠు వ్యాధిగ్రస్తులకు బుధవారం డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి చేతుల మీదుగా వీల్‌చైర్లను అందజేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో వీల్‌చైర్లు అవసరం ఉన్న 17 మందిని గుర్తించామన్నారు. వీరికి వీల్‌చైర్లు అందించాలని ఒరాకిల్ సంస్థను కోరటంతో వారు ముందుకు వచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా మచిలీపట్నం నగరంలో ఉన్న ఇరువురు వ్యాధిగ్రస్తులకు ఈ వీల్‌చైర్లను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ వహీద్‌భాషా, డాక్టర్ దేవసాగర్, డాక్టర్ అంబటి వెంకట్రావు, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నాగరాణి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



పెదప్రోలు(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొరం శివప్రసాద్ కుటుంబానికి బండ్రెడ్డి రామకృష్ణ రూ.10 వేలు అందజేశారు. బుధవారం బండ్రెడ్డి ప్రతినిధులు పూషడపు రత్నగోపాల్ ఈ సాయాన్ని మృతుని తల్లి కృష్ణకుమారికి అందజేశారు. బాచు శ్రీనివాసరావు, యడ్లపల్లి అజయ్, మానికొండ రాజా, బాచు రాము, బాచు నాగేశ్వరావు, రామాయణం శ్రీనివాసరావు, బాచు వెంకటేశ్వరావు, కాలిశెట్టి రంగారావు, బాచు శివప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం నగదు జమ

ఘంటసాల: మండలంలో ధాన్యం విక్రయించిన రైతులకు రూ.55.15 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమైనట్లు ఎంఏవో కె.మురళీకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఏవో మురళీ కృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ 2023 పంటకాలానికి మండలంలో 13 రైతు భరోసా కేంద్రాల నుంచి రూ.55.15 కోట్ల విలువైన 25,042 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. జనవరి 21వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించించిన ధాన్యం నగదు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయని చెప్పారు. ఈ నెల 31వ తేదీతో 2023 ఖరీఫ్ పంటకాలానికి ధాన్యం సేకరణ ముగుస్తుందని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఇంకా కుప్పలు నూర్చాల్సిన రైతులు ఈ నెలాఖరులోపు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏప్రిల్ 14న కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం గం.9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. నేత్ర వైద్య పరీక్షల వివరాల కోసం 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

నాణ్యమైన వెలుగులకు.. చకచకా పనులు

- రూ.48.63 కోట్లతో 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- లో వోల్టేజీ..ఓవర్ లోడ్ వంటి సమస్యలకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లోవోల్టేజీ, ఓవర్ లోడ్, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి సమస్యలకు చెక్ పెట్టి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు సిద్ధంగా ఉన్న మెటీరియల్

పెడన: పెడన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు మచిలీపట్నం, పామర్రు 132 కేవీల సబ్‌స్టేషన్లు నుంచి ప్రస్తుతం విద్యుత్ సరఫరా అవుతుంది. ఇక నుంచి పెడన నుంచి నియోజకవర్గమంతా విద్యుత్ సరఫరా అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెడన మండలం కూడూరు గ్రామంలో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఇప్పటికే ప్రారంభించారు. దీని నిర్మాణం 2024 డిసెంబరు కల్లా పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. 8.18 ఎకరాలలో రూ.48.63 కోట్లతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారు.

నియోజకవర్గంలో 11 విద్యుత్ సబ్‌స్టేషన్లు..

పెడన నియోజకవర్గంలో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 11 ఉన్నాయి. పెడన పట్టణంలో మూడు, బంటుమిల్లి మండలం అర్తమూరు, కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను, లక్ష్మీపురం సబ్‌స్టేషన్లకు మచిలీపట్నం 132 కేవీ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. పెడన మండలం చేవేంద్ర, గూడూరు మండలం గూడూరు, మల్లవోలు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలం చెరుకుమిల్లి ఈ ఐదు సబ్‌స్టేషన్లకు పామర్రు 132 కేవీ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ పరిస్థితుల్లో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే అన్ని వైపుల నుంచి విద్యుత్ స్టాండ్‌బైలో ఉంటుంది.

220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణంతో....

పెడన మండలం కూడూరులో నిర్మిస్తున్న 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మచిలీపట్నం 132 కేవీకి కూడా తిరిగి విద్యుత్‌ను సరఫరా చేసే కెపాసిటీ ఉంటుంది. గూడూరు మండలంలోని అన్ని 33/11 కేవీలు గల సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశాలున్నాయి. పెడనలో రైల్వే ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పెడన బైపాస్‌రోడ్డులోని రైలుగేట్ సమీపంలో దానికి కూడా విద్యుత్ సరఫరా చేయడానికి కూడా ఈ సబ్‌స్టేషన్ ఉపకరించనుంది.

నియోజకవర్గంలో సర్వీసులు..

పెడన నియోజకవర్గంలో కేటగిరి-1 నుంచి కేటగిరి ఐదు వరకు గల సర్వీసులు 70,635 విద్యుత్‌సర్వీసులున్నాయి. కేటగిరి-1లో డొమస్టిక్(గృహాలకు), కేటగిరి-2 కమర్షియల్(దుకాణాలు, కొట్టులు తదితరవాటికి), కేటగిరి-3లో రైస్‌మిల్లులు, కేటగిరి-4లో ప్రభుత్వ విద్యుత్ సర్వీసులు(స్కూల్స్, పంచాయతీలు, ఆసుపత్రులు), కేటగిరి-5లో ఆక్వా కల్చర్‌కు సంబంధించిన సర్వీసులున్నాయి. ఈ ఐదు కేటగిరిలకు సంబంధించి పెడన పట్టణంతో పాటు మండలంలో మొత్తం 23,402, కృత్తివెన్నులో 16,284, బంటుమిల్లిలో 16,738, గూడూరులో 14,211 సర్వీసులున్నాయి.

డిసెంబరు నాటికి పూర్తి..

పెడన నియోజకవర్గంలోని కూడూరులో నిర్మిస్తున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు 20 రోజులు కిందట ప్రారంభించాం. ఈ పనులు ఈ ఏడాది డిసెంబరు చివరికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. రూ.48.63 కోట్లతో 8.18 ఎకరాలలో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నాం. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితి ఉండదు.

–హరిప్రసాద్, ఏడీఈ, ట్రాన్స్‌కో

ముగిసిన పదో తరగతి పరీక్షలు

కేరింతలు కొట్టిన విద్యార్థులు



జెడ్పీ హైస్కూల్లో పరీక్షలు ముగియడంతో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఘంటసాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో చివరి రోజైన బుధవారం జరిగిన సోషల్ పరీక్షలో 263 మందికి 243 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరైనట్లు ఎంఈవోలు ఎస్.శివశంకరరావు, ఎండీ మోమిన్ తెలిపారు. పబ్లిక్ పరీక్షలు ముగిసిపోవడంతో విద్యార్థుల ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. పాత పుస్తకాలను చించి పేజీలను ఎగురవేస్తూ విద్యార్థులు కేరింతలు కొట్టారు.

ఘనంగా ఫరీద్ బాబా ఉరుసు



ఫరీద్ బాబాకు దట్టీ సమర్పిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం పెద్దకరగ్రహారం గ్రామంలో వేంచేసి ఉన్న బాబా ఫరీద్ మస్తాన్ అవులియా (ఫరీద్ బాబా) 57వ ఉరుసు మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉరుసు ఉత్సవంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్చార్జి పేర్ని కిట్టు కార్యక్రమంలో పాల్గొని దట్టి సమర్పించారు. బాబా వారి శుద్ధి స్నానం, గంధం మహోత్సవంతో పాటు అనంతరం జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. వేలాదిమంది భక్తులు హాజరై ఫరీద్ బాబా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ శొంఠి ఫరీద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సిలార్ దాదా, కార్పొరేటర్లు కాగిత బుజ్జి, నాయకులు శీలం బాబ్జి, మహమ్మద్ సాహెబ్, గూడవల్లి నాగరాజు, చిలంకుర్తి కొండా, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులోనే కాదు అండగా ఉంటా

పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము

కృత్తివెన్ను: అందుబాటులో ఉండడమే కాదు..అండగా ఉంటానని పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. బుధవారం ఆయన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి మండల పరిధిలోని లక్ష్మీపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అందె పెదకాపును కలసి ఆయన ఆరోగ్య విషయాలను వాకబు చేశారు. పార్టీకి సేవ లందించాలని మీకు పార్టీ ఆదరణతో పాటు నా ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక, మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మండలంలో ప్రజాదీవెన

కృత్తివెన్ను: మండల పరిధిలోని పల్లెపాలెం, లక్ష్మీపురం గ్రామాలలో గురువారం ఉదయం నుంచి ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన పార్టీ కార్యాలయం నుంచి వెలువడింది. ఈ కార్యక్రమంలో పార్టీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొని ప్రతి గృహాన్ని సందర్శిస్తారని తెలిపారు.

కౌలు హక్కుల వేలం వాయిదా

శ్రీకాకుళం(ఘంటసాల): చల్లపల్లి ఎస్టేట్ దేవాలయం శ్రీకాకుళేశ్వరస్వామి వారి దేవస్థానం భూముల కౌలు హక్కుల బహిరంగ వేలం వాయిదా వేసినట్లు దేవస్థానం ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు బుధవారం తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వరస్వామి వారి దేవస్థానానికి శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, పాపవినాశనం, గోగినేనిపాలెం, ఐనంపూడి గ్రామాల్లో ఉన్న భూములతో పాటు తెలుగురావు పాలెంలో ఉన్న చేపల చెరువులకు దేవదాయ ధర్మదాయ శాఖ వేలం బుధవారం నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం వాయిదా వేసినట్లు ఈవో చక్రధరరావు తెలియజేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

కోనేరుసెంటర్: బందరు మండలం బుద్దాలపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సెబ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బుద్దాలపాలెం గ్రామానికి చెందిన వెంట్రుప్రగడ రవిచంద్ర మోహన్ గుప్తా గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న సెబ్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో దాడి చేయించారు. గుప్తా వద్ద నుంచి 70 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతనికి మద్యం సరఫరా చేసిన హుస్సేన్ పాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ సురేష్ పైన కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గుప్తాను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐలు జి.రాజశేఖర్, స్వామిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 2.38 లక్షలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పెదకళ్లేపల్లిలో వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి హుండీ కానుకల ఆదాయం రూ. 2,38,904 వచ్చినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధర రావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివారావు సమక్షంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో కానుకలు లెక్కించారు. ఆలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బోల్తా కొట్టిన కారు

గూడూరు: విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టిన ఘటన గూడూరు మండలం తరకటూరు పాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం కారులో వ్యక్తి విజయవాడ నుంచి మచిలీపట్నం వైపునకు వెళ్తున్నాడు. తరకటూరుపాలెం సమీపంలో కారు అమాంతం అదుపుతప్పి పక్కనున్న పంటబోదిలోకి పల్టీలు కొట్టింది. కారులో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని బందరు ఆసుపత్రికి తరలించారు. గూడూరు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

3 నుంచి మహా కుంభాభిషేకం

పెడన: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసి 50 సంవత్సరమైన సందర్భంగా ఆలయంలో త్రయాహ్నిక మహా కుంభాభిషేకాలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘ పట్టణనాయకులు కొల్లూరి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఐదో తేదీ వరకు జరిగే ఈ మహాకుంభాభిషేకాల మహోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఐదో తేదీ ఉదయం ఏడు గంటలకు మహాకుంభాభిషేకం ఉంటుందని, అదే రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఓటర్లకు భరోసా కల్పిస్తూ పోలీసుల కవాతు



బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం సాధారణ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. సీఐ కె.నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అర్తమూరు, బంటుమిల్లి గ్రామ పుర వీధుల్లో 75 మంది కేంద్ర బలగాల సభ్యులు కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మైకుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి, పెడన-2 ఎస్ఐలు జి.వాసు, సత్యనారాయణ, బెటాలియన్ కమాండర్ ఆర్‌పి సింగ్, ఏఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు మాతృవియోగం



కె.కొత్తపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కె.కొత్తపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుటారం పాపారావు మాతృమూర్తి తుటారం బసవమ్మ (82) అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నంఇంటివద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, గాజుల హరిగోపాల్, పీఏసీఎస్ చైర్ పర్సన్ తుటారం కృష్ణ, గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి రాజాచంద్, దుట్టా అశ్వనీ కుమార్, మత్తి రాంప్రసాద్ పరామర్శించారు.

యువకుడికి గాయాలు

రామానగరం(చల్లపల్లి): ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. చల్లపల్లికి చెందిన అబూ బకర్ సిద్దిఖ్ లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలో గ్రామ సచివాలయం పక్కన పలావు సెంటరు నడుపుకుని జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి తన షాపు సమీపంలో నడిచి వెళుతుండగా, గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్దిఖ్ కాళ్లు, చేతులు విరిగిపోయాయి. తలకు గాయమైంది. స్థానికుల సహకారంతో కుటుంబ సభ్యులు హుటాహుటీన మచిలీపట్నం, అక్కడి నుంచి విజయవాడ తదుపరి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

గడప గడపకు సంక్షేమం కార్యక్రమంలో పేర్ని కిట్టు



మహిళలతో మాట్లాడుతున్న పేర్ని కిట్టు చిత్రంలో కార్పొరేటర్ వరప్రసాద్

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు సంక్షేమం కార్యక్రమంలో భాగంగా 20వ డివిజన్ కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్‌తో కలిసి గిలకలదిండిలో బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సమస్యలు విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సముద్రతీరంలో చేపలవేటే ప్రధాన వృత్తిగా నిర్వహిస్తూ జీవిస్తున్న మత్స్యకారుల అభివృద్ధికి సీఎం జగన్ పలు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. వేటనిషేధ సమయంలో ప్రతి ఏడాది వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారన్నారు. వేటకు వెళ్లే బోట్లకు సబ్సిడీతో ఆయిల్ ఇచ్చి ఆదుకున్నారన్నారు. ఇతర సంక్షేమ పథకాలను కూడా అర్హతను బట్టి అందించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో మరోసారి ఆయనను దీవించి సంక్షేమ పథకాలను కొనసాగించే అవకాశం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థి అయిన సింహాద్రి చంద్రశేఖరరావులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గిలకలదిండి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయాలి



ఎంపీడీవో శేషమాంబను సన్మానిస్తున్న ఉపాధి హామీ పథకం ఉద్యోగులు

ఘంటసాల: ఉపాధి హామీ పనులను నాణ్యతతో సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామి పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమాంబ మాట్లాడుతూ ఉపాధి పనులు చేసే కూలీలకు వేసవి కాలం దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన పనులు నాణ్యతతో సక్రమంగా చేసి కూలీలకు సకాలంలో నగదు చెల్లించేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకంలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనులు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎంపీడీవో శేషమాంబను ఉపాధి హామి పథకం అధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో కె.శ్రీనివాస చంద్, ఈఓపీఆర్డీ గుత్తికొండ కిషోర్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ జె.నాగేశ్వరరావు, ఏపీవో రాజ్ కుమార్, టీఏ అలివేలు మంగమ్మ, సీవో బాల సుబ్రహ్మణ్యం, బీఎఫ్‌టీ రాంబాబు, కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పళ్లెరం మహోత్సవం



నాగ పడగను అందజేస్తున్న వీరభద్రరావు దంపతులు

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో శ్రీ దుర్గా సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవాలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి పళ్లెరం పట్టుట (పెద్ద పళ్లెంలో దీపం పెట్టి మహిళలు ఊరేగిస్తారు) మహోత్సవం గురు, శుక్రవారాలు వైభవంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, వీరభద్రుడికి అభిషేకం , దీక్షాధారణ ఆనకట్టుట సాయంత్రం 5 గంటలకు వీరభద్రస్వామి పళ్లెం పట్టు అనంతరం స్వామివారిని జ్యోతులతో మహిళలు గ్రామోత్సవం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్ల కల్యాణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన సాయంత్రం 4 గంటలకు స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ, ముమ్మనేని వంశీకులు తెలిపారు.

వెండి నాగ పడగ సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి విజయవాడ కానూరుకు చెందిన డి.వీరభద్రరావు దంపతులు వెండి కిరీటం బుధవారం సమర్పించుకున్నారు. ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం సుమారు రూ.29 వేల విలువుగల వెండి నాగపడగను ఆలయ అధికారులు బర్మా ప్రసాద్, వెంకట్రాద్రిలకు అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బీసీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన



బీసీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న బీసీ నేత

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని బీసీల సంక్షేమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఎంతో అండగా నిలిచారని బీసీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లాశాఖ నాయకులు అన్నారు. నగరంలోని పెయింటర్స్ కాలనీలో బీసీ సంక్షేమ సంఘ భవనం నిర్మాణానికి అడిగిన వెంటనే 220 గజాల స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే పేర్ని నానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో బీసీ భవన్ నిర్మాణానికి ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, సంఘ నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘానికి రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలోనూ సొంత భవనాలు లేవన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని చొరవతోనే మచిలీపట్నంలో స్థలం కేటాయించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దాతల సహకారంతో మచిలీపట్నంలో బీసీ భవన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు దుర్గారావు, బొర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ప్రచారం

గూడూరు: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతూ బుధవారం మండలంలో డిజిటల్ ప్రచార రథంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని గూడూరు, ఆకుల మన్నాడు, కప్పలదొడ్డి, పోసినవారిపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఓటు హక్కు సద్వినియోగించుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరిస్తూ సందేశాత్మక వీడియోలు ప్రసారం చేశారు. గురువారం తరకటూరు, మద్దిపట్ల, కంచాకోడూరు, రాయవరం, మల్లవోలు, పోలవరం, రామరాజుపాలెం గ్రామాల్లో డిజిటల్ ప్రచార రథం పర్యటన ఉంటుందని తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి తెలిపారు,

యూటీఎఫ్ నేత సేవలు ఆదర్శనీయం

అవనిగడ్డ: యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, మండల శాఖ అధ్యక్షుడు కె.జీవేంద్రరావు, గౌరవ అధ్యక్షుడు పీవీ ఆంజనేయులు అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు సింహాద్రి శ్రీనివాసరావు, ఏ సంధ్యారాణి, కె.రాజశేఖర్, కొల్లూరి శ్రీనివాసరావు, స్వామి, అశోక్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్‌కు ఘన సత్కారం



ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ మహేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కృత్తివెన్ను: ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్‌ను బుధవారం సంగమూడి గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆయనకు దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పదవికి న్యాయం చేసేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. స్థానికులు కూనసాని తాతాజీ, వాసు, శ్రీనివాసరావు, నాగబాబు, మురళీ తదితరులు ఉన్నారు.